## వైకాపా పార్టీ నుండి టిడిపిలో చేరిక

అమరాపురం ఆగస్టు 26 ప్రభాతవార్త



టిడిపిలో చేరిన దృశ్యం

మండల పరిధిలో ఆలదపల్లి గ్రామంలో వైయస్సార్ పార్టీ నుండి ఐదు కుటుంబాలు టిడిపి పార్టీలో చేరినట్లు స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను చూసి, మరియు సూపర్ సిక్స్ పథకాలను అమలుపరచడంతో టిడిపి పార్టీలో చేరినట్లు వైకాపా నుండి టిడిపిలోకి చేరిన వార్డ్ మెంబర్ హళ్ళేరు శ్రీనివాస్ ఉగ్రప్ప గారి విష్ణుకుమార్ , అంగడి ముద్లప్ప, మునికెప్ప గారి శివన్న, యాదవ జయప్ప తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తి,మాజీ సర్పంచ్ పాండురంగప్ప, పంచాయతీ కన్వీనర్ మాజీ ఎంపిటిసిలుమంజునాథ్,నరసింహమూర్తి,, మాజీ డీలర్ ముద్దయ్య,మాజీసర్పంచ్ చంద్రప్ప, రామకృష్ణ ,మండల క్లస్టర్ కోకన్వీనర్ మంజు తారక్, ఫీల్డ్ అసిస్టెంట్ ముద్దరాజు, మాజీ ఎంపిటిసి నరసింహప్ప,గిరిరాజు, బిజెపి రంగనాథ్, , మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళుతున్న బ్యాంక్ మేనేజర్‌కు ఘన సన్మానం



సన్మానం చేస్తున్న దృశ్యం

అమరాపురం ఆగస్టు 26 ప్రభాతవార్త

మండల పరిధిలో హేమావతి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ లో మేనేజర్ గావిధులు నిర్వహిస్తూ తిరుపతికి బదిలీపై వెళ్తున్న రవీంద్ర నాయక్ ను మంగళవారం హేంజేరు సిద్దేశ్వర స్వామి దాసోహ కేంద్రం వద్ద స్థానిక నాయకులు, బ్యాంక్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు ఖాతాదారులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మేనేజర్ మురళీకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ నరేంద్రబాబు, సాయిప్రసాద్, క్యాషియర్ సత్యనారాయణ రెడ్డి, ఆఫీస్ అసిస్టెంట్ తిప్పేస్వామి,శశికుమార్ లతోపాటు నాయకులు డాక్టర్ శివానంద్, కోఆప్షన్ మెంబర్ రసూల్ బాషా, మాజీ ఆలయ కమిటీ ఛైర్మన్ గోవిందరాజు, దాసోహ కేంద్రం గోవిందరాజు, రవీంద్ర గుప్తా, అశ్వత్త నారాయణ, నాగరాజు, బిడి మూర్తి, రిటైర్డ్ హెచ్ఎం లింగన్న, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బ్యాంక్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న సమయంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన హేమావతి ప్రాంత రైతులకు ఖాతాదారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి రవీంద్ర నాయక్ సేవ చేశారని కొనియాడారు. అనంతరం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు.

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో వాతావరణం కలుషితం

### విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన ప్రధానోపాధ్యాయురాలు సుకన్య



మట్టి వినాయకులతో ఉపాధ్యాయ బృందం

మడకశిర ఆగష్టు 26 ప్రభాతవార్త:

మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాలను వాడాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారుచేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయటంవలన వాతావరణం, నీటి కలుషితం తప్పదని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు సుకన్య పేర్కొన్నారు. మడకశిర మండలం గుండుమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మట్టి గణపతి విగ్రహాలను విద్యార్థులచే చేయించి, మట్టి గణపతుల ప్రాధాన్యత ను తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుకన్య మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం వలన కాలుష్యంతో పాటు అనేక అనర్థాలు కలుగుతా యని పర్యావరణాన్ని కలుషితం చేసే విగ్రహాల కన్నా పర్యావరణహిత మట్టి విగ్రహాలను వాడటం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ జిసి కోఆర్డినేటర్ చంద్రమోహన్ రెడ్డి,ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపిలోని ఇరు వర్గాలపై కేసులు నమోదు

### అరెస్ట్ చేసిన పోలీసులు

బత్తలపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త

టిడిపిలోని రెండు వర్గాలపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి మంగళవారం రిమాండ్ కు పంపినట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. కట్టకిందపల్లికి చెందిన విశ్వనాథనాయుడుతో ఐదు మందిపై,గంటాపురం జగ్గుతో పాటు మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి ముస్టూరు సాంబ, నల్లబోయినపల్లి బెస్త కౌశిక్ పై విశ్వనాథనాయుడు వర్గం దాడి చేయగా ఇద్దరు గాయపడిన విషయము తెలిసిందే. అదేవిధంగా అక్రమంగా ఆయుధం కలిగి ఉన్న నల్లబోయనపల్లి గ్రామానికి చెందిన బెస్త కౌశిక్ తో పాటు గంటాపురం జగ్గు,ముస్టూరు సాంబ ప్రమేయం ఉన్నట్లు విచారణలో తెలియడంతో కౌశిక్ తో పాటు అప్పస్వామిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

## వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా సహకరించండి

### పీస్ కమిటీ సమావేశంలో సీఐ ప్రభాకర్

బత్తలపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ ప్రభాకర్

వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని సిఐ ప్రభాకర్ మత, కుల పెద్దలను కోరారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్సై సోమశేఖర్లు వినాయక చవితి పండగ సందర్భంగా పీస్ కమిటీ మీటింగ్ ను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బత్తలపల్లి లోని అన్ని మసీదుల నిర్వహకులు,మత పెద్దలు, గ్రామ పెద్దలు, విలేజ్ మహిళా పోలీసులు హాజరైనారు. సమావేశానికి హాజరైన వారిని ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ గ్రామంలో వినాయక చవితి పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నిమజ్జనం రోజున అందరూ సహకరించాలని సీఐ కోరారు.

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు..!

ధర్మవరం రూరల్ ఆగస్టు 26 ప్రభాతవార్త



తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ధర్మవరం పట్టణంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బస్టాండ్ పరిధిలోని బాలాజీ ఫర్టిలైజర్ సాయి రాం ఫర్టిలైజర్ పై జిల్లా విజిలెన్స్ పోలీస్ ఇన్స్పెక్టర్ గోపాలుదు, ఎస్సై సురేష్ కుమార్, డి సి టి ఓ మండల వ్యవసాయ అధికారి ముస్తఫా తనిఖీ నిర్వహించారు. దుకాణంలో స్టాక్ బోర్డు పై వివరాలు ఈపాస్ నిలువలు స్టాక్ రిజిస్టర్ భౌతికంగా నిలువలను పరిశీలించారు. నిల్వలో వ్యత్యాసం వలన 10 6300 రూపాయల విలువ గల 3.95టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేయడం జరిగింద న్నారు. ఈ క్రమంలో భాగంగానే పోతుకుంట గొట్లూరు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులనిల్వలను తనిఖీచేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి ముస్తఫా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుకాణదారుల నిర్వాహకులతో పాటు కానిస్టేబుల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన గణేష్ వేడుకలు..

ధర్మవరం రూరల్ ఆగస్టు 26 ప్రభాతవార్త



విద్యార్థులు నాట్య ప్రదర్శనను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పట్టణములోని రిషి విద్యాలయంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పాఠశాలలో గణేష్ వేడుకలను విద్యార్థుల ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని పాఠశాల ప్రిన్సిపల్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరు గొప్ప ?అనే నాటకమును విద్యార్థులు ప్రదర్శించడం పలువురిని ఆకట్టుకోవడం సంతోషమన్నారు. భగవంతుని తర్వాత కంటికి కనిపించే ప్రత్యక్ష దైవాలు తల్లిదండ్రులను వారి ఆశీస్సులు తీసుకుంటూ స్మరించుకోవాలని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో మట్టి గణపతుల తయారీ పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ ఘనపరిచిన వారికి బహుమతులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్ రెడ్డి సీఈఓ రవీంద్ర ఏవో రంగారెడ్డి , కళ్యాణి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రెడ్ బుక్ రాజ్యాంగం మీద కాకుండా ప్రజలకి ఇచ్చిన హామీల మీద దృష్టి పెట్టండి

### అక్రమ కేసులు, అరెస్టులు, తప్ప అభివృద్ధి శూన్యం డిసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి,



బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

తాడిమర్రి ఆగస్టు 26 (ప్రభాతవార్త)

హామీల అమలులో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రశ్నించిన ప్రతిపక్షాలపై అక్రమ కేసులు దాడులు తప్ప అభివృద్ధి శూన్యమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలో "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమాన్ని నిర్వహించారు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నమ్మించినట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు 50 సంవత్సరాలకే పింఛన్ పథకాన్ని అమలు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది గడిచిన ఆ హామీ నెరవేర్చిన పాపాన పోలేదని అన్నారు. అలాగే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, తదితర హామీలకు దిక్కు మొక్కు లేదని విమర్శించారు. అమలు చేసిన పథకాలలో కూడా అర్హులైన వారికి అన్యాయం జరిగిందని అన్నారు. వికలాంగుల పెన్షన్ల వెరిఫికేషన్ లో అర్హులైన నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు.కూటమి ప్రభుత్వం హయాంలో అవినీతి అక్రమాలు అక్రమ కేసులు తప్ప అభివృద్ధి ఆమడ దూరంలో కూడా కనిపించడం లేదని అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి జోలి రెడ్డి అశ్వర్థ , జడ్పిటిసి పోరాల్ల సావిత్రి విజయభాస్కర్‌రెడ్డి, మండలకన్వీనర్ ఆర్వేటి రామాంజనే యులు, ఆల్లెసాయినాథ్‌రెడ్డి, ఎంపిటీసీలు చంద్రబాబునాయుడు, లక్ష్మన్న, సర్పంచులు కుంటాల పుల్లయ్య, శెట్టిపల్లి వెంకట నారాయణ రెడ్డి, మంజుల నారాయణస్వామి, గుజ్జల హనుమంతు, మదమంచి మల్లికార్జున నాయుడు, సిద్దే రవీంద్రారెడ్డి, బాల రమణారెడ్డి, విశ్వనాథ్, గంగిరెడ్డి, శివ, తోపాటు పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు.

## ప్రమాద వాహనాన్ని మార్చిన పోలీస్ ..

మడకశిర టౌన్ ఆగస్టు 26 ప్రభాతవార్త.



వృద్ధుడిని ఢీ కొట్టిన వాహనం.

మడకశిర పట్టణంలోని మార్కెట్ యార్డ్ సమీపంలోని కొడికొండ టు శిర (nh544e) ప్రధాన రహదారి పై మూడు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మడకశిర మండలం పరిధిలోని వైబి హళ్లి గ్రామానికి చెందిన చిక్కన్న అనే వ్యక్తి మృతి చెందాడు. అయితే ఏ వాహనం వల్ల వ్యక్తి మృతి చెందాడు ఆ వాహనం కాకుండా మరో వాహనాన్ని ప్రమాద సంఘటనలో చూపించడం విశేషం. వాస్తవంగా ప్రమాదానికి గురైన ఈచర్ వాహనం (ap-02 -th-3169) ఈ వాహనం ఒక వృద్ధుడిని ఢీ కొట్టగా చిక్కన్న ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మడకశిర పట్టణ పోలీసులు మూడు రోజుల తర్వాత మరో ఈచర్ వాహనం (ap-39-ua-5088) ఈ వాహనం ఢీ కొట్టినట్లు కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనా వ్యక్తి మృతి చెందిన తర్వాత కూడా మృతుడిని ఢీకొన్న వాహనంపై కేసు నమోదు చేయకుండా మరొక వాహనంపై కేసు నమోదు చేయడం చూస్తే పోలీసుల విశ్వసనీయతపై పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.



పోలీసులు తెరమీదకు తెచ్చిన మరో వాహనం

## ష్రేడర్ యంత్రం పనితీరును తనిఖీ చేసిన ఏఎంఎస్ సెంట్రల్ టీం అధికారి

### -యంత్రాన్ని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో ఉంచి వినియోగించాలని సూచన

ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త



ష్రేడర్ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంఎస్ సెంట్రల్ టీం అధికారి బి.రామచంద్ర

పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఉన్న ష్రేడర్ యంత్రాన్ని మంగళవారం అర్బన్ వికస్ మేనేజ్‌మెంట్ సిస్టం సెంట్రల్ టీం అధికారి బి.రామచంద్ర పరిశీలించారు. పంచాయతీలకు ప్లాస్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం కింద కేంద్రం ష్రేడర్ యంత్రాన్ని అందించగా దాని పరితీరును తెలుసుకోవడానికిగాను ఆయన పర్యటన కొనసాగింది. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో ఉంచి వినియోగించాల్సిన యంత్రాన్ని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఎందుకు ఉంచారని సెంట్రల్ టీం అధికారి బి.రామచంద్ర పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్‌ను ప్రశ్నించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీకు ప్రహరీగోడ, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇక్కడ ఉంచడం జరిగిందని త్వరలోనే వినియోగించుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఎస్‌సీ జిల్లా కన్సల్టెంట్ జ్యోతి, స్వచ్ఛభారత్ ఎంసీవో జయప్రకాష్‌గౌడ్, పంచాయతీ మేస్త్రీలు పాల్గొన్నారు.

## వినాయక చవితి పండుగ కొనగోళ్ల సందడి

### -కిటకిటలాడిన క్లాక్‌టవర్, తెలుగుతల్లి, వైఎస్ఆర్ విగ్రహం సర్కిళ్లు
### -పూజా సమాగ్రి ధరల పెరుగుదలతో సామాన్యులకు ఇబ్బందులు

ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త



ఉరవకొండలోని క్లాక్‌టవర్ కూడలిలో పండుగ కొనగోళ్ల సందడి దృశ్యం



అమ్మకానికి ఉంచిన బొజ్జగణపయ్యల చిన్న విగ్రహాలు

సర్వ విఘ్నాలు దూరం చేసే వినాయక చవితి పండుగను ప్రజలు వైభవంగా జరుపుకొంటున్నారు. బుధవారం జరిగే పండుగకు నిత్యవసర వస్తువులు, పూజా సామాగ్రి, కూరగాయలు కొనగోళ్లతో మంగళవారం పట్టణంలోని క్లాక్‌టవర్, తెలుగుతల్లి, వైఎస్ఆర్ విగ్రహం సర్కిళ్లు కిటికిటలాడుతూ కనిపించాయి. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలతోపాటు పలుచోట్ల మట్టి విగ్రహాలు కూడా అమ్మకానికి పెట్టగా మట్టి విగ్రహాలకు డిమాండ్ కనిపించింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాల ధరలు అమాంతం పెరిగిపోవడం, ఆ విగ్రహాలు పర్యావరణానికి హాని చేకూరుస్తాయని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు జరుగుతుండటమే ఇందుకు కారణమైంది. నిత్యవసర వస్తువులు మొదలు, పూజా సామాగ్రి, కూరగాయల ధరలు పెరుగడంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ధరల నియంత్రణకు చర్యలు లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. అయితే కొత్తబట్టలకొనగోళ్ళు అంతంతమాత్రమేనని వ్యాపారులు వాపోయారు. ఇప్పుడు కురిసిన వర్షాలు నెలన్నర ముందు కురిసి ఉంటే వినాయక చవితి పండగ మరింత ఘనంగా ప్రజలు జరుపుకునే వారని తెలుస్తోంది. విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలతో సరైన సమయంలో సంవృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రజలు వేడుకొంటున్నారు.

## ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణకు తరలి రండి

రామగిరి, ఆగస్టు 26 ప్రభాతవార్త

మండల కేంద్రమైన రామగిరి టిడిపి కార్యాలయ ఆవరణంలో ఈ నెల 29న టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం రామగిరి టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో టిడిపి సీనియర్ నాయకుల ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, పరందామయాదవ్, శ్రీరాములునాయక్, సింగిల్‌విండో ప్రెసిడెంట్ ముత్యాలు, మాధాపురం శంకర, మాజీ సర్పంచు శ్రీనివాసులు, విశ్వనాథ్, లిగమయ్య, గుర్రం శీన, ఆవుల ముత్యాలు మాట్లాడారు. పరిటాల రవీంద్ర జయంతిని ఈ నెల 30 జరగనున్న సందర్భంగా పలు కార్యక్రమాలు చేపట్టినట్టు పేర్కొన్నారు. 29న ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ అనంతరం బెంగళూర్ ఎంఎస్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం రామగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పంచాయితీ రాజ్ అతిథిగృహ ఆవరణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ నెల 30న పెనుకొండలో మంత్రి సవిత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. పెనుకొండలో జరిగే ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేతోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. 30న వెంకటాపురంలో పరిటాల రవీంద్ర జయంతిని నిర్వహించిన అనంతరం కార్యక్రమాలలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాలకు టీడీపీ నాయకులు, పరిటాల అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అధికారులు



తనిఖీ చేస్తున్న తహ శీల్దారు

అగళి, ఆగస్టు 26 ప్రభాతవార్త

మండలకేంద్రమైన అగళి పట్టణంలో షిర్డి సాయి ట్రేడర్స్, వెంకటేశ్వర ట్రేడర్స్, సప్తగిరి హార్డ్‌వేర్, వాసవి ఫెర్టిలైజర్స్, మధూడి గ్రామంలోని టిఎంటి ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాలను మంగళవారం మండల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహశీల్దారు సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఎస్ఐ వీరేష్, ఏఎస్ఐ శ్రీరాములు తనిఖీ చేశారు. ఎరువులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అమ్మాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఎరువుల అమ్మకాల వివరాలను నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎరువలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు అవసరం మేరకే యూరియాను వాడాలని నానో యూరియా, నానో డిఏపి వాడాలని రైతులకు సూచించారు.

## ఎమ్మెల్యేచే భీమా చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం రూరల్,ఆగస్ట్ 26 ప్రభాతవార్త

రాప్తాడు నియోజకవర్గం, అనంతపురం రూరల్ మండలం , ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన పూజారి శ్రీనివాసులు కుమారుడు పూజారి వంశీకృష్ణ మార్చి 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించగా... తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగిఉండడంతో ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ (ప్రమాద భీమా) మంజూరు కాగా... అనంతపురం క్యాంప్ కార్యాలయంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ మంజూరైన 5లక్షల చెక్కును సంబంధిత మృతుని కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది

## పేద కుటుంబానికి సరుకులు పంపిణీ



నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్,ఆగస్ట్ 26 ప్రభాతవార్త

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఛైర్పర్సన్ డాక్టర్. శ్రీమతి. ఎస్. నిర్మలమురళి, ట్రస్ట్ సభ్యురాలు శ్రీమతి సౌదామని చేతుల మీదుగా పేద ఒంటరి మహిళలకు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందించారు. వినాయక చవితి శుభాకాంక్షలుతో పాటు ట్రస్టు సభ్యురాలు శ్రీమతి సౌదామణి వారి కుమార్తె శ్రీమతి గౌరీ పుట్టినరోజు అలాగే ట్రస్ట్ సభ్యులు శ్రీమతి వాణిశ్రీ, బద్రీనాథ్ కుమారుడు శ్రేయష్ పుట్టినరోజు పురస్కరించుకొని మంగళవారం పుట్టినిల్లు ఆశ్రమంలో రెండు నెలలకు సరిపడా 35 రకాల వస్తువులతో పాటు ఒక బియ్యం ప్యాకెట్ ను ఒంటరి మహిళ శ్రీమతి అంజనమ్మకు అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ అంజనమ్మ భర్త అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ముగ్గురు కుమార్తెలు ఉన్న అంజనమ్మ ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. కుటుంబ పోషణ భారమై ఉన్న పరిస్థితులలో గమనించి వారికి సహాయం అందించామన్నారు. ఆపదలోను అవసరంలను ఉన్న పేదలకు సహాయం చేయాలని కోరారు. కుటుంబ పోషణతో భారమైన ఒంటరి పేద మహిళలు ఆత్మస్థైర్యంతో జీవించాలన్నారు. ఏదో ఒక రూపంలో దేవుడు సహాయం చేస్తాడని నమ్మకంతో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పేద కుటుంబాలకు సహాయం చేయాలని కోరారు. అందరూ వినాయక చవితి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీమతి లక్ష్మి, సుమిత్ర, కావ్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ మండల నాయకులకు వినాయక చవితి శుభాకాంక్షలు

### - మండలం మహిళా కన్వీనర్ బోయ అనిత.

అనంతపురం రూరల్, ఆగస్ట్ 26 ప్రభాతవార్త



బోయ అనిత

వైఎస్ఆర్ సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి, అనంత రూరల్ మండలంలోని వైఎస్ఆర్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు, వివిధ విభాగాల అధ్యక్షులకు, వైఎస్ఆర్సీపి మహిళలకు, అధికారులకు, అనధికారులకు, శ్రేయోభిలాషులకు, బంధుమిత్రులకు, అందరికీ పేరుపేరునా వినాయక చవితి శుభాకాంక్షలుతెలియజేయడం జరుగుతుందని రూరల్ మండలం మహిళా కన్వీనర్ బోయ అనిత తెలిపారు.

## కాలుష్య రహిత వినాయక చవితిని జరుపుకుందాం

### - ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ విష్ణు ప్రియ



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, ఆగస్ట్ 26 ప్రభాతవార్త

అనంతపురం రూరల్ ప్రాంతమైన కురుగుంట గ్రామం నందు ఈరోజు ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం మరియు ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణు ప్రియ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ఉపయోగించాలని మరియు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నివారించాలని కోరారు, ఎందుకంటే అవి నీటి వనరులను కలుషితం చేస్తాయి. నీటిలోని జల ప్రాణులను కూడా హరిస్తాయని. పర్యావరణాన్ని కలుషితం చేయడం వల్ల ప్రత్యక్షంగాను పరచంగానూ మనిషి జీవన వైవిధ్యాలలో అనేక ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ రోళ్ళ భాస్కర్ ,ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సహాయ కార్యదర్శి కే .మహేంద్ర, సోనీ, ఇండియన్ రెడ్ క్రాస్ వాలంటరీ జే. బాలాజీ ,మై భారత్ వాలంటరీ కురబ దివ్యతేజ,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తేజస్విని పాల్గొన్నారు.



## రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలి,

### అక్రమ నిల్వలు గుర్తిస్తే కఠిన చర్యలు:తాసిల్దార్ భాస్కర్ రెడ్డి

తాడిమర్రి ఆగస్టు 26 (ప్రభాతవార్త)



ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాలలో నిర్ణయించిన ధరలకే ఎరువులు పురుగుమందులు విక్రయించాలని అలాగే రైతులకు నాణ్యమైన మందులు సరఫరా చేయాలని అలా కాకుండా ఎరువులు అధిక ధరలకు అమ్మినా నకిలీ మందులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తాసిల్దార్ భాస్కర్ రెడ్డి, అగ్రికల్చర్ అధికారులు ఎరువుల దుకాణదారులను హెచ్చరించారు. మంగళవారం ఆర్డిఓ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని శ్రీనివాస ఫర్టిలైజర్, మరియు ఎస్వీ ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుకాణంలోని రికార్డులను నిల్వ ఉన్న ఎరువులు, మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులకు ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయాలని అలాగే ధరల పట్టికఆధారంగానే ఎరువులు విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. తనిఖీ చేసిన ఎరువుల దుకాణాలలో ఎటువంటి అవకతవకలు గాని, అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఆధారాలు లేవని తెలిపారు.

09ATP27_09ATP27.qxd 26-08-2025 PM 10:49 Page 1



## గుడ్ బ్యాడ్ టచ్ గూర్చి పిల్లలకు అవగాహన కల్పించండి

**-ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జీ డి.దుర్గాకళ్యాణి**

**-రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు**

**ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**



సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ డి.దుర్గాకళ్యాణి

నేటి సమాజంలో తరుచూ చిన్న పిల్లలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని వారికి గుడ్, బ్యాడ్ టచ్ గూర్చి తల్లిదండ్రులతోపాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జీ డి.దుర్గాకళ్యాణి అన్నారు. మండల పరిధిలోని రాకెట్ల, పి.కౌకుంట్ల గ్రామాల్లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాలు, వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. జడ్జీ డి.దుర్గాకళ్యాణి మాట్లాడుతూ పిల్లలపై లైంగిక వేధింపులను నిరోధించడానికి ఫోక్సో చట్టం అమలులో



హాజరైన ప్రజలు

ఉందన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాల వయసు నిండిన తరువాతే పెళ్లి చేయాలని ఆలోపు పెళ్లి చేస్తే అది చట్టరిత్యా నేరంగా పరిగణించబడి పెళ్లిళ్ళు చేసిన, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. పనిచేసే ప్రదేశంలో మహిళలు వేధింపులకు గురి కాకుండా నిరోధించడానికి చట్టాలు ఉన్నాయన్నారు. ఎవరైనా పని ప్రదేశంలో వేధింపులకు గురవుతుంటే వెంటనే పోలీసులను సంప్రదించి రక్షణ పొందవచ్చున్నారు.

## ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించిన కార్తీక్

**-మొదటి ప్రయత్నంలోనే రాష్ట్రంలో 3007 ర్యాంకు సాధన**

**ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**



కార్తీక్

ఉరవకొండ పట్టణానికి చెందిన కార్తీక్ అనే విద్యార్థి ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించాడు. స్థానిక 11వ వార్డు పార్కు అభయాంజినేయస్వామి ఆలయం ప్రాంతంలో నివాసముండే టైలర్ కుమారస్వామి, శారద దంపతుల కుమారుడు కార్తీక్ మొదటి ప్రయత్నంలోనే ఈ ఏడాది మే 4న జరిగిన నీట్ పరీక్షలో (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్) రాష్ట్ర స్థాయిలో 3007 ర్యాంకు (రోల్ నంబర్: 1205114305) సాధించి కడప మెడికల్ కాలేజీలో సీటు దక్కించుకొని ఔరా అనిపించుకున్నాడు. కార్తీక్ పట్టణంలోని జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగత చదువుకొని సాయి ట్యుటోరియల్‌లో శిక్షణ పొందాడు. కార్తీక్ ఎంబీబీఎస్ సీటు సాధించడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## జింక పిల్లను ఫారెస్టు అధికారులకు అప్పగించిన పాత్రికేయుడు

**బత్తలపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త**



జింక పిల్లను ఫారెస్టు అధికారులకు అందజేస్తున్న దృశ్యం

పొలంలో జింక మంగళవారం జింక పిల్లను ప్రసవించింది. అదే సమయంలో కుక్కలు గమనించగా జింక తన పిల్లను వదిలేసి పారిపోగా జింక పిల్లను కుక్కల బారి నుంచి ఓ పాత్రికేయుడు మంజుల రాధాకృష్ణ రక్షించించి ఇంటికి తీసుకువచ్చాడు. దానికి పాలుతాపించి కాపాడాడు. అనంతరంఫారెస్టు అధికారులకు ఫోన్‌చేసి వివరాలు అందించారు. సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్లు అక్కులప్ప, గిరిలు వచ్చి జింకపిల్లను స్వాధీనంచేసుకున్నారు. సంఘటనాస్థలాన్ని చూపాలని వారు కోరడంతో పొలం వద్దకు వెళ్లి రాధాకృష్ణ జింక ప్రసవించిన స్థలాన్ని చూపించారు. అక్కడ తల్లి జింకను వెతికిన వారికి నిరాశే ఎదురైంది. దీంతో వారు ఆ జింక పిల్లను నేలకోట పారెస్టులో జింకల మందలో వదిలేసేందుకు దానిని తమ వెంట తీసుకువెళ్లారు.

## ఘనంగా మదర్‌థెరిసా 115వ జయంతి

**-నివాళులర్పించిన దళిత జేఏసీ నాయకులు**

**ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**

భారతరత్న, గొప్ప మానవతా మూర్తి మదర్‌థెరిసా 115వ జయంతిని దళిత జేఏసీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణంలో మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అల్బేనియా దేశానికి చెందిన ఆగ్నెస్ గోక్షా బొజాక్షు భారతదేశ పౌరసత్వం పొంది మిషనరీ ఆఫ్ చారిటీను 1950 కోల్‌కత్తాలో స్థాపించి 45 సంవత్సరాలపాటు పేదలకు, రోగులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్నవారికి పరిచర్యలు చేశారన్నారు. ఆమెకు 1980లో భారత అత్యున్నత పురస్కారమైన భారతరత్న బిరుదును అందించారన్నారు. మదర్‌థెరిసాను స్ఫూర్తిగా తీసుకొని తోటి వారికి చేతనైనంత సాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత జేఏసీ నాయకులు మీనుగ గోపాల్, చంద్రశేఖర్, మారెన్న, మల్లెల జగదీష్, ఎర్రిస్వామి, పురుషోత్తం, బాట ఎర్రిస్వామి, మహేష్, ఎర్రిస్వామి, మారెన్న, లాలుస్వామి, రామాంజి, ప్రసాద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆముదం పంటలో శనగపచ్చ, నామాల పురుగు నివారణ చర్యలు చేపట్టండి

**- బూదగవి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏవో బి.రామకృష్ణుడు**

**ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**



'పొలం పిలుస్తోంది' కార్యక్రమం దృశ్యం

ఆముదం పంటకు శనగపచ్చ, నామాల పురుగు ఆశించిందని దాని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు సూచించారు. మండల పరిధిలోని బూదగవి గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి ఆముదం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో బి.రామకృష్ణుడు మాట్లాడుతూ శనగపచ్చ, నామాల పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాముల మందును 100 లీటర్ల నీటిలో కలిపి లేదా కోరాజిన్ 60 ఎంఎల్ మందును 100 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పంట నమోదు చేసుకోవాలని, పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు ఈనెల 30 తేదీ వరకు గడువు ఉందని సూచించారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ తదితర పథకాల గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా గౌరసంద్రం మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

**-అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు**

**ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**



ప్రత్యేకాలంకరణలో గౌరసంద్రం మారెమ్మ మూలవిరాట్

పట్టణంలోని 9వ వార్డులో వెలసిన గౌరసంద్రం మారెమ్మ ఆలయ వార్షికోత్సవం స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం భాద్రపద తదియ మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయ నిర్వాహకులు వంశరాజుల మారెన్న ఆధ్వర్యంలో పెన్నానది నుండి గంగాజలాలు తీసుకొచ్చి గంగపూజ చేసిన అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు ఆకుపూజలుచేసి మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి దర్శించుకొని కుంకుమార్చనలు చేయించి మొక్కులు చెల్లించుకోగా వారికి తీర్థప్రసాదాలను అందించారు.

## పర్యావరణ హితం కోసం మట్టి వినాయకులనే పూజిద్దాం..!

**-తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్**

**-జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ**

**ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న తహశీల్దార్, ఎంపీడీవో, ఏవో, పంచాయతీ కార్యదర్శి, దాతల దృశ్యం

పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయకుల విగ్రహాలనే పూజిద్దామని తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఎంపీడీవో బి.వి.రవి ప్రసాద్, మండల వ్యవసాయాధికారి బి.రామకృష్ణుడు, మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్ పిలుపునిచ్చారు. జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టి.పవన్‌కుమార్, టి.సుమలత దంపతుల సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ అధ్యక్షతన మంగళవారం జై కిసాన్ ఫౌండేషన్ కార్యాలయంవద్ద జరిగిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర ్భంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి పలువురికి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 8 సంవత్సరాల నుండి జై కిసాన్ ఫౌండేషన్ ద్వారా నాగమల్లి ఓబులేష్, రజనీకుమారి దంపతులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీచేసు ్తండగా రెండేళ్ళనుంచి టి.పవన్, టి.సుమలత దంపతులు తమ కవలపిల్లలు టి.ఓమిశా,టి.ఓమాన్స్ జన్మదినం సందర్భంగా విగ్రహాలను అందిస్తుండటం అభినందనీయమ న్నారు. ప్లాస్టర్‌ఆఫ్‌ప్యారీస్‌తో తయారుచేసిన విగ్రహాలకు వేసినరంగులు పర్యావరణానికి హాని కలుగజేసి వాటిని నిమజ్జనం చేసిన నీటిని కలుషితం చేస్తాయని వివరించారు. ఈ లయన్స్ క్లబ్ ప్రతినిధి సి.నాగేశ్వరరావు, ఆపద్బాంధవ ట్రస్టు ఛైర్మెన్ వేల్పుల మురళి, జైకిసాన్ ఫౌండేషన్ సభ్యులు రజనికుమారి, లావణ్య, మనస్వి, అక్రాంత్ రుషి, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

## గణపయ్యలను కొలువుదీర్చడానికి ముస్తాబైన మండపాలు

**- ఉరవకొండ పట్టణంతోపాటు గ్రామాల్లో మొదలైన కోలాహలం**

**- మేళతాళాలతో ఊరేగింపుగా వినాయక విగ్రహాల తరలింపు**

**ఉరవకొండ, ఆగస్టు 26 ప్రభాతవార్త**



పట్టణంలోని 10వ వార్డు పాత బళ్లారి రోడ్డులో సిద్దమైన వినాయక మండపం

వినాయక చవితి పండుగ వేడకలకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గణేష్ మండపాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పట్టణంలో వీధికి ఒకటి చొప్పున దాదాపు 150కుపైగా ప్రదేశాల్లో వినాయక విగ్రహాలను కొలువుదీర్చనుండగా గ్రామాల్లోనూ ఒక్కో గ్రామంలో ఐదు పది చోట్ల విగ్రహాలను కొలువుదీర్చనున్నారు. ఉరవకొండ ప్రాంతంలో పండుగ ప్రధానంగా 3, 5 రోజులపాటు జరుగనుండగా ఆయా రోజుల్లో పండుగను అంగరంగ వైభవంగా జరుపుకోవడానికి ఉత్సవ సమితులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తీ చేశాయి. వివిధ ఆకారాల్లోని వినాయక విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేయడానికిగాను మండపాలను ఆకర్షనీయంగా ముస్తాబుచేసి రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. రెండు రోజుల నుండే వినాయక విగ్రహాలను మేళతాళాలతో కేరింతలు కొడుతూ బాణా సంచా పేల్చుతూ వైభవంగా వినాయక మండపాలకు తరలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సీఐ బి.మహానంది ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## టిడిపి కార్యకర్తల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ

**అమరాపురం ఆగస్టు 26 ప్రభాతవార్త**



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దృశ్యం

మండల పరిధిలోని విరుపసముద్రం గ్రామంలో టిడిపి నాయకులు మంజునాథ్ మాతృమూర్తి స్వర్గస్తులైనందున ఆమె పార్తివదేహానికి మాజీ ఎమ్మెల్సీ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా నాగోనపల్లి గ్రామం డీలర్‌జయప్ప సోదరుడు టిడిపినాయకులు కృష్ణప్పమృతి చెందడంతో వారిచిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్,కృష్ణమూర్తి, సింగల్ విండో అధ్యక్షులు గణేష్, మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ మండల కన్వీనర్ శివ రుద్రప్ప ,కార్యదర్శి నాగరాజు, చంద్రప్ప, క్లస్టర్‌కోకన్వీనర్‌చెన్నప్ప, యువనాయకుడు మంజునాథ్,రఘు, మాజీసర్పంచ్ రాధాకృష్ణ డీలర్లసంఘంఅధ్యక్షుడు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, మాజీ ఎంపీపీ రామిరెడ్డి నిరంజన్ తిప్పేస్వామి కృష్ణమూర్తి తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి

**గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త**



రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని పౌరశాఖ గ్రంథాలయాన్ని మంగళవారం గ్రంథాలయసంస్థ జిల్లా కార్యదర్శి రమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పన్నుల బకాయిలను వసూలు చేసేందుకు కృషి చేయాలని ఆమె సూచించారు. గ్రంథాలయాలను సద్వినియోగపరుచుకోవాలని ఈ సందర్భంగా ఆమె పాఠకులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## గొడవలకు దూరంగా ఉండండి...!

**ధర్మవరం రూరల్ ఆగస్టు 26 ప్రభాతవార్త**



గ్రామసభలను నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

మండల పరిధిలోని గ్రామస్తులు గొడవలకు దూరంగా ఉంటూ గ్రామ ప్రజలు చట్ట పరిధిలోనే జీవించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని సెంగాటిపల్లి సుబ్బారావు పేట, తుమ్మల గ్రామాలలో గ్రామసభలను ఎస్ ఐ శ్రీనివాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయా గ్రామస్తులతో ఎస్ ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ఐక్యమత్యంతో ప్రశాంతంగా జరుపుకోవాలని విగ్రహ మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. సచివాలయ మహిళా పోలీసులు ప్రతి గ్రామములో వినాయక చవితి పండుగ సజావుగా జరిగేటట్లు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఎప్పటికప్పుడు గ్రామంలో పరిస్థితుల సమాచారాన్ని రూరల్ పోలీస్ స్టేషన్ కు అందించాలని తెలిపారు. నిమజ్జనం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు యూరియా సక్రమంగా పంపిణీ చేసి ఆదుకోవాలి

**ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నాగరాజు**

**కనేకల్లు ఆగస్టు 26 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ఎంఆర్పిఎస్ నాయకులు

మండల వ్యాప్తంగా యూరియా ఎరువుల కొరత తీవ్రంగా ఉందని యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే యూరియా సమస్య ప్రభుత్వం తీర్చాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ప్రచార కార్యదర్శి నాగరాజు అన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ బ్యాంకుల దగ్గర రైతులకు యూరియా రేపు మాపు ఇస్తామంటూ రైతులను ముప్పతిప్పలు పెడుతున్న ఎరువుల సొసైటీ బ్యాంకుల రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు అన్నారు. ముఖ్యంగా వరి సాగు చేస్తున్న రైతులు అవసరమైన యూరియా అందకపోవడంతో కష్టాల్లో కూరుకుపోయారని అన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో కనేకల్, బొమ్మనహాళ్ మండలాలు వరి సాగులో ప్రధానంగా నిలుస్తున్నాయని, కానీ వరి పంటకు అవసరమైన యూరియా అందకపోవడం వల్ల రైతులు వరి సాగు చేయాలా వద్దా అనే సందిగ్ధంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.కొన్ని రోజుల క్రితం వచ్చిన యూరియాను రైతులకు పంపిణీ చేసినా, ఒక రైతుకు కేవలం రెండు ప్యాకెట్లు మాత్రమే ఇవ్వడం రైతులకు మరింత సమస్యగా మారిందని తెలిపారు.ఒక ఎకరా వరి సాగు చేస్తున్న రైతు, ఐదు ఎకరాల వరి సాగు చేస్తున్న రైతు ఇద్దరికీ సమానంగా రెండు ప్యాకెట్లు మాత్రమే ఇవ్వడం ఎంతవరకు న్యాయం అని ఎమ్మార్పీఎస్ హెచ్ నాగరాజు ప్రశ్నించారు.ఒక ఎకరాకు కనీసం రెండు యూరియా ప్యాకెట్లు ఇవ్వాలని, ఐదు ఎకరాలు ఉన్న రైతుకు కనీసం పది ప్యాకెట్లు అందించాలి అని. యూరియా ఇవ్వని పక్షంలో రైతులు ఎలాంటి పరిస్థితుల్లో పంట సాగు చేయగలరు అని వారు ప్రశ్నించారు.ఈ పరిస్థితి కొనసాగితే, కనేకల్ పట్టణంలోని వ్యవసాయ రైతులతో కలిసి ధర్నా చేస్తామని ఎమ్మార్పీఎస్,హెచ్ నాగరాజు హెచ్చరించారు. అధికారులు వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హెచ్ నాగరాజు లాలు ప్రసాద్, సమర, టిసి మారెన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలని సామరస్యంగా అన్నదమ్ముల వలే జరుపుకోవాలి- సీఐ వెంకటరమణ

**కనేకల్లు ఆగస్టు 26 ప్రభాతవార్త**

శ్రీ వినాయక స్వామి ఉత్సవాలను సామరస్యంగా అన్నదమ్ముల వలె పండగను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని కనేకల్ మండల ప్రజలకు సీఐ వెంకటరమణ సూచించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో తాసిల్దార్ బ్రహ్మయ్య సిఐ వెంకటరమణ ఎస్సై నాగ మధు ఆధ్వర్యంలో మండలంలోని వినాయక మండపాలను నెలకొల్పే సభ్యులు మరియు మైనార్టీ సభ్యులు తో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరమణ ఎస్ఐ నాగ మధు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఎలాంటి గొడవలు లేకుండా సామరస్యంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. వినాయక మండపాలకు అమర్చున్న విద్యుత్తు లైటులను విద్యుత్ తీగలను ఆది జాగ్రత్తగా ఒకటి రెండుసార్లు గమనించి వేయాలన్నారు. విద్యుత్ మెయిన్ తీగలకు దగ్గరలో మండపాలన నిర్మించరాదని దూరంగా వేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయము కలగ కుండా మండపాలను నిర్మించుకోవాలన్నారు. ఈ ఉత్సవాలను ప్రతిఒక్కరూ సామరస్యంగా భక్తిశ్రద్ధలతోభజనతో జరుపుకోవాలని అన్నారు. పెద్ద పెద్దగా డీజే సౌండ్ లు మద్యం సేవించి ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై పోలీస్ శాఖ నిఘా ఉంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది మండల ప్రజలు పాల్గొన్నారు

## అర్హులైన వికలాంగుల పెన్షన్లు పునరుద్ధరించాలి - సిపిఎం డిమాండ్



ఎంపిడిఒకు వినతిపత్రం అంద చేస్తున్న సిపిఎం నాయకులు

**చిలమత్తూరు, ఆగస్టు 26 ప్రభాతవార్త**

చిలమత్తూరు మండలంలో అనర్హత పేరుతో అర్హులైన వికలాంగుల పెన్షన్లు నిర్ధాక్షిణ్యంగా తొలగించడం అన్యాయమని సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిడిఒ రమణమూర్తికి మంగళవారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వికలాంగులు మాట్లాడుతూ ఇప్పటివరకు 10-15 సంవత్సరాలుగా నిరంతరం పెన్షన్ పొందుతున్న వికలాంగులకు ఇంతకు మునుపు 85-90 శాతం అర్హత ఆధారంగా భరోసా పెన్షన్లు మంజూరయ్యాయని గుర్తుచేశారు. కేవలం పెన్షన్ పైనే ఆధారపడి కుటుంబ పోషణ, ఆరోగ్యం, పిల్లల చదువు జరుపుకుంటున్న వికలాంగులు పెన్షన్ నిలిపివేతతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ చర్య వల్ల కుటుంబాలు వీధినపడి ఆత్మహత్యలకు కూడా దారితీసే పరిస్థితి ఏర్పడుతుందని అవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే వెరిఫికేషన్ చేసి అర్హులైన వికలాంగులందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్, నరసింహ, దివ్యాంగులు లక్ష్మినారాయణ, ఆదినారాయణప్ప, నరసింహమూర్తి, శీవప్ప, తదితరులు పాల్గొన్నారు.

## 108 ఇరవై ఏళ్లుగా సేవ చేస్తున్నా... నిలుపు కోవడానికి షెడ్డు లేదు

**- 108 నిలుపు కోవడానికి స్థలం చూపండి అంటూ సిబ్బంది తహశీల్దార్‌కు వినతి**



తహశీల్దార్‌కు వినతిపత్రం అంద చేస్తున్న సిబ్బంది

**గోరంట్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త**

ప్రాణాపాయస్థితిలో వున్న వ్యక్తులను సకాలంలో ఆసుపత్రులకు చేర్పించి ఎన్నో ప్రాణాలను కాపాడే 108 వాహనాన్ని నిలుపుకోవడానికి స్థలం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక తహశీల్దార్ మారుతిప్రసాద్‌కు 108 సిబ్బంది లిఖితపూర్వక వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఉమర్‌ఖాన్‌తో పాటు 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీదేవి, నాగేంద్ర, నరసింహులు, శ్రీనివాసులు వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందచేశారు. గోరంట్ల మండలానికి 108 వాహనాన్ని ప్రభుత్వం కేటాయించినప్పటికీ ఆ వాహనాన్ని నిలుపుకోవడానికి ఎక్కడ షెల్టర్ లేక ఇబ్బంది పడుతున్నామని, గోరంట్ల మండలంలో గత 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్నామని ఇప్పటికైనా 108 వాహనానికి స్థలం గాని ఒక రూము గాని కేటాయించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## గోరంట్ల నాటి...సిఐ సుబ్బరాయుడుపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం

**- యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్పయాదవ్ ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలు**

**గోరంట్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త**

ఒక ఫిర్యాదుపై విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి చిన్నా పెద్దా అనే వయసు చూడకుండా విచారణలో తీవ్రస్థాయిలో దుర్భాషలాడి, తీవ్ర మనోవేదనకు గురిచేసి, సమాజంలో అవమానానికి లోనయ్యేలా చేశాడని న్యాయం కోసం బాధితుడు అఖిలభారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్పయాదవ్ కోర్టును ఆశ్రయిస్తే సాక్షులను విచారించిన కోర్టు జరిగిన సంఘటన నిజమని ఇందుకు కారకుడైన గోరంట్ల నాటి సిఐ సుబ్బరాయుడుపై సిసి నెంబర్ 516/ 20 25పై కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు బాధితుడు లక్ష్మీనరసప్పయాదవ్ తెలియచేశారు. ఆయన తెలిపిన వివరాలు వున్నాయి. గత 2023లో ఒక వ్యక్తి నాపై ఇచ్చిన ఫిర్యాదు విషయంలో విచారణ పేరుతో గోరంట్ల పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వాస్తవాలు తెలుసుకోకుండా చెప్పడానికి ప్రయత్నిస్తే వినకుండా బహిరంగంగా తీవ్రస్థాయిలో అసభ్యపదజాలంతో తిట్టాడని ఆపై చేయి చేసుకున్న సంఘటనపై న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించానని అయితే అక్కడ విచారణలు సాక్షుల వివరణ విన్న కోర్టు ఇది వాస్తవంగా జరిగిన సంఘటనని భావించి ఇందుకు కారకుడైన సిఐ సుబ్బరాయుడుపై కేసు నమోదు చేయాలని ఆదేశించారని బాధితుడు లక్ష్మీనరసప్పయాదవ్ పత్రికలకు తెలియచేశారు.

## సజావుగా మున్సిపల్ కౌన్సిల్ మీట్

**గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త**



మున్సిపల్ సమావేశం జరుగుతున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం ఛైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన సజావుగా కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో కుక్కలు, కోతుల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిమజ్జనంకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలగురించి తీర్మానించారు. ఈసమావేశంలో మున్సిపల్‌కమీషనర్ జబ్బార్‌మియా,వైస్ ఛైర్‌పర్సన్ వరలక్ష్మియాదవ్, సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఘనంగా మదర్‌థెరిసా జయంతి వేడుకలు

**గుత్తి, ఆగస్టు 26 ప్రభాతవార్త**




నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలో మంగళవారం పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో మదర్‌థెరీసా 115వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ విదేశీయురాలు అయినప్పటికీ, దేశ పౌరసత్వం స్వీకరించి, దేశంలో రోగులకు వృద్ధులకు అనాథలకు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, కుల్లాయిబాబు, లక్ష్మినారాయణ, షెక్షావలి, శామ్యూల్, నారాయణరెడ్డి, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన రైతు బిడ్డ సొల్లాపురం దివ్య దీపిక

**కనేకల్లు ఆగస్టు 26 ప్రభాతవార్త**



ఎంబిబిఎస్ సీట్ సాధించిన బిడ్డకు స్వీట్ తినిపిస్తున్న రైతు దంపతులు

ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతు కుటుంబంలో చదువుల తల్లి సరస్వతి వికసించింది దివ్య దీపిక అనే విద్యార్థిని ఎంబిబిఎస్ సీటు సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి హద్దు లేకుండా పోయింది. కనేకల్ మండల పరిధిలోని సొల్లాపురం గ్రామంలోని వీరస్వామి రైతు కుమార్తె దివ్యా దీపిక ఎంబిబిఎస్ సీటు సాధించడంతో తండ్రి ఎర్ర స్వామి ఆనందం వ్యక్తపరిచారు. సందర్భంగా తండ్రి ఎర్రిస్వామి మాట్లాడుతూ అనంతపురం కురు గుంట రెసిడెన్సి గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతూ నీట్ కోచింగ్ తిరుపతి కె ఎస్ ఆర్ ఎమ్ ఇన్స్టిట్యూట్ లో లాంగ్ టర్న్ ఒక సంవత్సరం చదివి ఎంబిబిఎస్ కోచింగ్ లో చేరి కష్టపడి చదివి పరీక్షలో 434 మార్కులు సాధించింది ఎంబిబిఎస్ సీటు సాధించింది అన్నారు. ఎంబీబీఎస్ సీటు వచ్చినందుకు గాను కుప్పం పిఎస్ కాలేజీలో సీటు వచ్చిందని దివ్య దీపిక తండ్రి సంతోషాన్ని బంధువులు అందరికీ తెలిపాడు,గ్రామ ప్రజలు కూడా దివ్య దీపికకు ఎంబీబీఎస్ సీటు సంపాదించిన ఆనందంలో అందరూ దివ్య దీపికకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి చదివితే కోట్ల రూపాయల గల చదువు కూడా ఉచితంగా లభిస్తుంది అని మరొకసారి సొల్లాపురం గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి కూతురు దివ్య దీపిక నిరూపించారు.

